

సిద్దిపేట: ఆధార్ కార్డు కోసం చిన్న పిల్లలతో సెంటర్ వద్ద కూర్చున్న మహిళ

# అప్‌డేట్ ఆందోళన..!

- ఆధార్ కేంద్రాల మూసివేత..
- మెదక్ జిల్లా వ్యాప్తంగా మీ సేవ పరిధిలో 16 ఆధార్ కేంద్రాలు
- ఐదు కేంద్రాల్లో మాత్రమే సేవలు
- ఆరు గ్యారెంటీల నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన
- గందరగోళంగా 'ప్రజాపాలన'



సిద్దిపేట పట్టణంలోని మీసేవా కేంద్రం వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం లైన్‌లో వేచిఉన్న ప్రజలు

మెదక్, (నమస్తే తెలంగాణ)/ సిద్దిపేట/ మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 29: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరి కావడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొన్నది. రేషన్ కార్డు లేనివారు, ఆధార్‌కార్డు లేని వారు, ఉన్న వాటిలో అప్‌డేట్ అవసరమైన వారు ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. మెదక్ జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో మీ సేవలో ఆధార్ కేంద్రాలు మూతపడడంతో ఆయా మండలాల ప్రజలు సైతం ఆధార్ కేంద్రం ఉన్న మండల కేంద్రానికి వెళ్తున్నారు. అక్కడికి వెళ్లినా వందల మంది దరఖాస్తుదారులు క్యూలో నిల్చోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, చిన్న పిల్లలతో వచ్చిన మహిళలు, వృద్ధులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి దాపురిస్తోంది.



మెదక్ ఆధార్ కేంద్రంలో వేచి ఉన్న ప్రజలు

## మెదక్ జిల్లాలో 11 కేంద్రాలు మూసివేత..

మెదక్ జిల్లాలో 16 మీ సేవ పరిధిలో ఆధార్ నమోదు కేంద్రాలుండగా, వీటిలో 11 కేంద్రాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. కేవలం 5 ఆధార్ కేంద్రాలు మాత్రమే నడుస్తున్నాయి. ఇందులో రేగోడ్, అల్లాదుర్గం, పెద్ద శంకరంపేట, చిన్నశంకరంపేట, మెదక్ మండలాల్లో మాత్రమే ఆధార్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. దీంతో ఆయా మండలాల ప్రజలు ఆధార్ కార్డు నమోదు, కేవైసీ వివరాల అప్‌డేట్ కోసం ఇతర మండలాలకు వెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలులో భాగంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డుల కోసం ఆధార్ కేంద్రాల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరుతున్నారు. దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో ఉండడంతో వారిని నిలువరించడం నిర్వాహకులకు ఇబ్బందిగా మారింది.

## సిద్దిపేటలో..

రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఆయా సంక్షేమ పథకాల కోసం ఆధార్ కార్డు అనుసంధానం తప్పని సరి చేయడంతో ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయడానికి ప్రజలు ఆధార్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. దీనికి తోడు మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ కోసం ప్రతి ఒక్కరూ గ్యాస్ బుక్ ఈకేవైసీ చేయడానికి ఆయా గ్యాస్ ఏజెన్సీ వద్ద లైన్ కడుతున్నారు. సిద్దిపేట పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆంధ్రా బ్యాంక్, మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న మీ సేవా కేంద్రం వద్ద కరీంనగర్ రోడ్డులో ఉన్న ఆధార్ అప్‌డేట్ సెంటర్ల వద్ద ప్రజలు బారులు తీరారు. నూతన ఆధార్ కార్డుల కోసం చిన్న పిల్లలతో వచ్చి ఆధార్ సెంటర్ల వద్ద లైన్లో ప్రజలు నిలబడ్డారు.

## ఈ-కేవైసీ తిప్పలు..

కాంగ్రెస్ ప్రభుత్వం అందించే రూ.500లకు గ్యాస్ కనెక్షన్ కావాలంటే ఈ-కేవైసీని చేసుకోవాలని ప్రచారం కావడంతో ఉమ్మడి మద్దూరు మండలానికి చెందిన ప్రజలు పెద్దఎత్తున మద్దూరు మండల కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద మూడు రోజులుగా పెద్దసంఖ్యలో బారులు తీరుతున్నారు. శుక్రవారం ఉదయం 8గంటల వరకే వందల సంఖ్యలో ప్రజలు గ్యాస్ ఏజెన్సీకి చేరుకున్నారు. సాయంత్రం 5గంటల వరకు ఈ-కేవైసీ చేసుకోవడానికి జనం ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై గ్యాస్ ఏజెన్సీ డీలర్‌ను వివరణ కోరగా, ఈ-కేవైసీ కోసం ఎలాంటి గడువు లేదని, జనం పెద్ద సంఖ్యలో రావడం వల్ల గ్యాస్ సిలిండర్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయ అన్నారు.

## గందరగోళంగా ప్రజాపాలన..

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకాలకు అర్హుల ఎంపిక కోసం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరిస్తున్నది. ప్రతి దరఖాస్తుకు ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు తప్పనిసరి చేసింది. దీంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొన్నది. ప్రజాపాలనలో గృహలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు, చేయూత పథకాలకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకుగానూ రేషన్ కార్డు నంబర్, ఆధార్ కార్డు నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ సర్వీస్ నంబర్ తదితర వివరాలు దరఖాస్తు ఫారంతో జత చేయాల్సి ఉంటుంది. కాగా, కొత్త రేషన్ కార్డుల జారీకి ఎలాంటి దరఖాస్తులు స్వీకరించడం లేదు. ఇది తెలియని జనాలు రేషన్ కార్డుల్లో తమ పిల్లల పేర్లు చేర్పించేందుకు కొత్తగా ఆధార్ కార్డు కోసం కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఇది లావుండగా, రూ.500లకే సిలిండర్ కేవైసీ చేయించుకోవాలని పుకార్లు వస్తుండడంతో సైతం జనాలు ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణకు ఎగబడుతున్నారు. ఫలితంగా ఆధార్ కేంద్రాల వద్ద గందరగోళం నెలకొంటున్నది.



మెదక్‌లో చిన్నారులతో ఆధార్ కేంద్రం వద్ద ప్రజలు

## మెదక్ జిల్లాలో 5 కేంద్రాలు నడుస్తున్నాయి..

మెదక్ జిల్లా వ్యాప్తంగా 16 ఆధార్ కేంద్రాలు ఉండగా, ఇందులో 5 మాత్రమే నడుస్తున్నాయి. 11 ఆధార్ కేంద్రాల ఆపరేటర్ల ఐడీలు తాత్కాలికంగా డియాక్టివ్ చేశారు. ఇందులో నాలుగు ఆధార్ కేంద్రాల్లో మరో పది రోజుల్లో తిరిగి ప్రారంభిస్తాం. ఆయా మండలాల్లోని ఆధార్ కేంద్రాల ఆపరేటర్లు ఆధార్ కార్డులకు సంబంధించిన డాక్యుమెంట్లను సరిగా నమోదు చేయలేదని, మరికొన్ని కేంద్రాల్లో రేషన్ కార్డులోఉన్న వ్యక్తులను ఆధార్ కార్డుల్లో తప్పుగా నమోదు చేయడం లాంటి తప్పులు జరిగాయి. దీంతో ఆయా మండల కేంద్రాల్లో ఆధార్ సేవలు అందడం లేదు.

– సందీప్, ఈడీఎం, మెదక్

# దరఖాస్తు ఫారాలకు.. యుద్ధం..!

సంగారెడ్డి, డిసెంబర్ 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంతో అర్హులైన వారికి ఆరు గ్యారంటీ పథకాలను అందజేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నది. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని 17వ వార్డు అస్తల్‌గడ్డలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో అధికారులు గుర్తించిన 285 కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు సిద్ధమయ్యారు. దరఖాస్తు ఫారాలు అందుతాయో లేదో అని వార్డు వాసులు యుద్ధం చేయాల్సి వచ్చింది. మున్సిపల్ అధికారులు నియమించిన వార్డు ఇన్‌చార్జిపై దరఖాస్తుల కోసం ఎగబడ్డారు. దరఖాస్తు ఫారాలు సరిపోను లేకపోవడంతో అధికారులపై ప్రజలు మండిపడ్డారు. ఏ వార్డులో చూసినా ఇదే సమస్య ఎదురవుతున్నదని ప్రజలు చెబుతున్నారు. దరఖాస్తుల పంపిణీ ఇలా ఉంటే పథకాలు ప్రజలకు అందించే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## ఫారాలు అందక ప్రజల ఆందోళన

సిర్గాపూర్, డిసెంబర్ 29: మండలంలోని ఉజలంపాడ్ గ్రామంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు దరఖాస్తు ఫారాలు అందకపోవడంతో ఆవేదనతో ఎంపీడీవో సుజాతను నిలదీశారు. ఈమేరకు వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఒకరోజు ముందుగానే గ్రామంలో 175 దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. అయినా గ్రామ సభలో ఫారాలు లేకపోవడంతో ఆగ్రహానికి గురయ్యారు. కొంత సమయం తర్వాత ఎంపీడీవో ఫారాలు తెప్పించి ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో మధ్యాహ్నం రూప్లాతండాలో గ్రామసభ చేపట్టారు. మండలంలోని చిన్న ముబారక్‌పూర్, ముబారక్‌పూర్‌లో రెండో టీం ఎమ్మార్వో ఉమామహేశ్వర్ ప్రజాపాలన కార్యక్రమాన్ని కొనసాగించారు.



సిర్గాపూర్: ఫారాలు అందక పోవడంతో ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న స్థానికులు

# అవసరమైన ఫారాలు అందిస్తాం

### సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 29: పట్టణ ప్రజలకు అవసరమైనన్ని దరఖాస్తు ఫారాలను అందివ్వడానికి సిద్ధంగా ఉన్నామని సిద్దిపేట అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి చెప్పారు. హుస్నాబాద్ పట్టణంలోని 2, 10వ వార్డుల్లో ప్రజాపాలన నిర్వహించే కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ పథకాల్లో ఏది అవసరమున్నా దరఖాస్తులో పొందుపర్చాలని సూచించారు. హుస్నాబాద్ పట్టణానికి ఏడువేలకుపైగా దరఖాస్తు ఫారాలు అందించామని, దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశముండడంతో మరో ఇరువైవేలకుపైగా ఫారాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. స్థానికంగా నివాసం ఉన్నవారికి వ్యవసాయ భూమి ఎక్కడ ఉన్నా నమోదు చేసుకోవచ్చని, పాస్ బుక్‌నంబర్లు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కిరాయి ఇండ్లల్లో ఉన్న వారు సైతం గృహజ్యోతి విషయాన్ని నమోదు చేసుకునేందుకు అభ్యంతరం ఏమీలేదని చెప్పారు. జనవరి 6 వరకు దరఖాస్తులు కేంద్రాలుంటాయని, మిగిలిపోయిన వారు మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో అందించవచ్చని తెలిపారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్లలో నివసించే వారికి కరెంట్ మీటర్లు ఇవ్వలేదని పలువురు వివరించగా, తక్షణమే విద్యుత్ మీటర్లను బిగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎటువంటి సమస్యలపై దరఖాస్తులు ఇచ్చినా తీసుకోవాలని, ఇంటికి దరఖాస్తులు తప్పనిసరిగా ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి విధివిధానాలు ఇంకా ఖరారు కావాల్సి ఉందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందులో మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్‌విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, కమిషనర్ ఎంఆర్.రాజశేఖర్, కౌన్సిలర్లు బోజు రమాదేవి, గోవిందు రవి, వల్లపు రాజు, మ్యాదరబోయిన శ్రీనివాస్, ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణ, మెప్మా కో-ఆర్డినేటర్ రాజు, మాజీ సర్పంచ్ మడప జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.



హుస్నాబాద్ పట్టణంలోని 2వ వార్డులో దరఖాస్తును స్వీకరిస్తున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి